



జిల్లా అభివృద్ధి ప్రణాళిక పుస్తకాన్ని కాలవ శ్రీనివాసులకు అందిస్తున్న సిపిఎం నాయకులు

జిల్లా అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికలు అవసరం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-రాయదుర్గం, కళ్యాణదుర్గం

త్వరలో జరగనున్న లోకసభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు జిల్లా, నియోజకవర్గ అభివద్ధికి నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. ఆదివారం ఆయన రాయదుర్గం, కళ్యాణదుర్గంలో పర్యటించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న టిడిపి అసెంబ్లీ అభ్యర్థులు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, వైసిపి అభ్యర్థులు ఎంపీ తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డిలను కలిసి సిపిఎం రూపొందించిన "అనంతపురం జిల్లా అభివద్ధి- ప్రత్యామ్నాయ విధానాలు- ప్రజా ప్రణాళిక" అనే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ విలేకరులతో మాట్లాడుతూ గత నవంబర్ నెలలో సిపిఎం అనంతపురంలో సదస్సు ఏర్పాటు చేసి జిల్లా అభివద్ధికి నిర్దిష్టమైన ప్రతిపాదనలను రూపొందించిందని తెలియజేశారు. జిల్లాలో వ్యవసాయం, నీటిపారుదల, పారిశ్రామిక అభివద్ధి, విద్యా, వైద్య రంగాల్లో అభివద్ధి, సామాజిక తరగతులకు సంబంధించి ఏ అంశాలలో ఏం చర్యలు చేపట్టాలో తీర్మానాలు చేసి వాటిని ప్రభుత్వానికి పంపినట్టు చెప్పారు. లోకసభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను కలిసి వారికి సిపిఎం రూపొందించిన జిల్లా ప్రణాళిక పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో గెలిచాక జిల్లా అభివద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. జిల్లాలో వ్యవసాయం అట్టడుగు స్థానంలో ఉందన్నారు. కేవలం నాలుగు శాతం భూమికి మాత్రమే సాగునీటి వనరులు అందుతున్నట్లు చెప్పారు. పారిశ్రామిక, ఉపాధి కల్పన, గొర్రెలు, మేకల పెంపకం, గార్మెంట్, గ్రానైట్ పరిశ్రమల్లో అధిక విద్యుత్ ఛార్జీలు, ముడి సరుకులు ధరలు పెరగడంతో పరిశ్రమలు మూతబడి ప్రజలు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం వలసలు వెళ్లే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వ్యవసాయ రంగం, నీటిపారుదల అభివద్ధికి నిర్దిష్ట ప్రతిపాదనలు చేశామన్నారు. హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ, బిటి ప్రాజెక్టు ఎత్తిపోతలు మొదలైన పనులను ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసేలా ప్రజల్లో అభ్యర్థులు స్పష్టమైన హామీని ఇవ్వాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున, పట్టణ సహాయ కార్యదర్శి జి.మధు, డీ.హీరేహాల్ మండల కార్యదర్శి ఎన్.లోకేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున, నాయకులు రమేష్, కృష్ణ నాయక్, అంజి, తిమ్మరాజు, కనేకల్ మండల కార్యదర్శి కోరి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అభివృద్ధి ప్రణాళిక పుస్తకాన్ని ఎంపీ తలారి రంగయ్యకు అందిస్తున్న సిపిఎం నాయకులు


ఓపీఎస్ అమలు చేసే పార్టీకే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఓపీఎస్ అమలుపై స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే వచ్చే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప తెలియజేశారు. ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నాడు వాల్‌పెయింటింగ్‌ను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీఎస్ అమలు చేస్తూ మొదటి సంతకంతో దానిపై పెడతామనే పార్టీకే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు వేస్తారన్నారు. ఓపిఎస్‌పై స్పష్టమైన హామీని ప్రభుత్వాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆమడదూరంలో శింగనమల అభివృద్ధి..!

◆ సాగునీటికి తప్పని తిప్పలు ◆ ఉద్యానవన పంటలకు నిలయం



ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఉద్యానవన పంటలు పండే ప్రాంతం శింగనమల నియోజకవర్గం. బంగారు పంటలు పండే భూములున్నా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇక్కడి నుంచే అత్యధికంగా మంత్రులుగా పనిచేసిన వారూ ఉన్నారు. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం ఆ తరువాత వాటిని విస్మరించడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఒకరి తర్వాత ఒకరు పాలకులు మారుతున్నారే గానీ ఇక్కడి సమస్యలు మాత్రం తొలగడం లేదు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆగిన మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ

శింగనమల నియోజకవర్గంలో సాగునీటిని అందిస్తున్నది మిడ్‌పెన్నార్. దీని కిందనున్న దక్షిణ కాలువ ఈ నియోజకవర్గం మొత్తానికి నీటిని అందించే ప్రధానమైన ప్రాజెక్టు. ఈ కాలువ ఆధునీకరణ 2017లో చేపట్టారు. రెండు ప్యాకేజీల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. ఈ ఐదేళ్లలో ఇవి పూర్తిగా ఆగిపోయాయి. కాంట్రాక్టర్ ఈ పనులు చేయలేం.. రద్దు చేయాలని నోటీసులు సైతం ఇచ్చారు. ఆధునీకరణ లేకపోవడంతో నీటి నిర్వహణలో ఇబ్బందులు తప్పడం లేదు.

చెరువులకు నీరిస్తున్నట్టు కాగితపు ప్రకటనలు

శింగనమల నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తున్నట్టు ప్రభుత్వం ఒక ఉత్తర్వులిచ్చింది. దీన్నే పెద్దఎత్తున ప్రచారం చేపడుతోంది. అయితే ఈ నీటి కేటాయింపులు చూస్తే ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదన్నది స్పష్టమవుతోంది. ప్రభుత్వం ప్రకటించినట్టు అన్ని చెరువులకూ నీరివ్వాలంటే 18 టిఎంసిల వరకు నీరు అవసరమవుతుంది. అది కూడా హంద్రీనీవా ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచిన తరువాత కేటాయింపులు జరిపారు. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం పనులు ప్రారంభం అవలేదు. అది పూర్తయ్యి చెరువులకు నీరు ఎప్పటికిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.

చాగల్లు నిర్వాసితుల గోడు అరణ్య రోదనే



పెద్దపప్పూరు మండలంలో నిర్మించిన చాగళ్లు రిజర్వాయర్ కింద ఉల్లికల్లు గ్రామం ఉంది. నీటిని పూర్తి స్థాయిలో నింపినప్పుడు గ్రామం ఆనుకుని నీరు చేరుతోంది. దీంతో తమకు పరిహారమిచ్చి పునరావాసం కల్పించాలని చాలా సంవత్సరాలుగా గ్రామస్తులు ఆందోళనలు చేస్తున్నారు. వారికి పరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటంచింది. కాని ఇప్పటి వరకు నిధుల కేటాయింపులు జరగలేదు. పోరాటం చేస్తున్న నిర్వాసితులు మాత్రం ఇటీవలనే జైలుకు సైతం వెళ్లివచ్చారు.

ఉద్యానవన పంటలకు ఊతమేది..?

అత్యధికంగా ఉద్యనవన పంటలు ఈ ప్రాంతంలోనే పండుతాయి. ఈ పంటలకు ప్రాసెసింగ్ చేసే పరిశ్రమలేవి ఇక్కడ లేవు. రైతులు సొంతంగా సుదూర ప్రాంతాలకు మార్కెట్‌కు తరలించాల్సి వస్తోంది. అక్కడ ధరల మోసాలతోనూ రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యనవన పంటలు అమ్ము తున్న సమయంలో డబల్ సూట్‌ల తోనూ నష్టపోతున్నారు. అదే విధంగా ఇక్కడ పశుసంపద అధికం. ప్రధానంగా గొర్రెల పెంపకం ఎక్కువగా ఉంటుంది. గొర్రెల పెంపకం దారులకు సరైన ప్రోత్సహకం లేదు. ఏటా పశుగ్రాసం కోసం ఈ ప్రాంతం నుంచి కర్నాటక తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మూతబడిన లెదర్ పార్కు

శింగనమల ఎస్సీ రిజర్వు నియోజకవర్గం కూడా కావడంతో ఇక్కడ నిదనవాడ గ్రామ సమీపంలో లేదర్‌పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో చర్మకార కార్మికులకు శిక్షణిచ్చి చర్మకార వృత్తిపై ఆధారపడిన కార్మికులకు ప్రోత్సహించాలని దీన్ని ఏర్పాటు చేశారు. కాని ఈ లెదర్‌పార్కు పూర్తిగా మూతబడింది. దీన్ని తెరిపిస్తామని ఎన్నికల్లో హామీలివ్వడంతోనే సరిపెడుతున్నారు.



శింగనమల చెరువు (ఫైల్ ఫొటో)



మిడ్‌పెన్నార్ డ్యాం

చరిత్ర చిహ్నాలను భావితరాలకు తెలియజేద్దాం

◆ మంత్రి ఆర్‌కె.రోజా ◆ పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాల ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వారసత్వ సంపదను కళ్లకు కట్టినట్టుగా భావితరాలకు తెలియజేసేలా అనంతపురంలో పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడలు, పురావస్తు శాఖ మంత్రి ఆర్‌కె.రోజా తెలిపారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో అటవీ శాఖ కార్యాలయం ఎదురుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – పురావస్తు ప్రదర్శనశాలల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ డా॥జి.వాణిమోహన్, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ సహాయ సంచాలకులు డా॥వి.రజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనంతపురంలో దాదాపు రూ.7 కోట్లతో పురావస్తు ప్రదర్శనశాలను చక్కగా డిజైన్ చేసి ఏర్పాటు చేశామన్నారు. ఇందులో పురాతన శిలయుగం, మధ్య శిలయుగం, పూర్వ, చారిత్రక గ్యాలరీలు, రాతి, జైన శిల్పాలు, బూడిద ముద్దలు, ఇనుప పనిముట్లు, ఎర్రకోట బొమ్మలు, ఇటుకలు, నాణేలు, పెయింటింగ్స్, చైనావేర్ మరియు పింగాణి సామాను, ఆయుధాలు లాంటివి ఏర్పాటు చేశారన్నారు. పాఠశాలల పిల్లలు మ్యూజియంకి వచ్చి మన వారసత్వ సంపదను తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.



కల్లూరు సుబ్బారావు పురావస్తు ప్రదర్శన శాల గురించి తెలుసుకుంటున్న రోజా

ఉప గ్రంథాలయాధికారికి ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సుబ్బరత్నమ్మను సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమా

అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథాలయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరత్నమ్మ ఉద్యోగోన్నతిపై గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆమెకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమా మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా గ్రంథాలయం అభివృద్ధిఇలో సుబ్బరత్నమ్మ సేవలు వెలకట్టలేనివన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్ రెడ్డి, ఉద్యోగ సంఘం నాయకులు వై.ప్రతాపరెడ్డి, బి.రవికుమార్ నాయుడు, హెచ్.రామాంజనేయులు, గోవిందు, హెచ్.శ్రీనివాసులు, కమ్మన్న, జయరాము, ఇంతియాజ్, శ్రీపతి, విజయభాస్కర్, కృష్ణయ్య, వీరనారాయణరెడ్డి, వేణుగోపాల్, రాయుడు, రామాంజినమ్మ, కావేరి, జిఎం.బాషా, కృష్ణ పాల్గొన్నారు.



రంజాన్ ఉపవాస స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఆవాజ్ నాయకులు

రంజాన్ ఉపవాసదీక్షల కార్డులు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిములు ఆచరించే ఉపవాస దీక్షలను తెలియజేస్తూ ఆవాజ్ ఆధ్వర్యంలో తయారు చేసిన గ్రీటింగ్‌కార్డులను అనంతపురం జామియా మజీద్‌లో ఆదివారం విడుదల చేశారు. ఇందులో ఉపవాస దీక్షలను తెలియజేయడమే కాకుండా ఎన్ఆర్‌సి సిఏలో రంగనాథ మిశ్రా కమిషన్ సిఫార్సును అమలు చేయాలని, ముస్లింల జనాభా ప్రాతిపదికంగా బడ్జెట్ కేటాయింపులు జరపాలని, వక్ఫ్ ఆస్తులు పరిరక్షించాలని, సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలనే తదితర డిమాండ్లను తెలియజేస్తూ కార్డులను ముద్రించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముష్కిన్, అధ్యక్షులు వలి, ఇస్మాయిల్, రహమతుల్లా, మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు దాదాగాంధీ, బాషా, తమూచెర్ల బాబా ఫక్రుద్దీన్, మసూద్, నూర్, ముష్కిన్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి : వి.సావిత్రి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పిలుపునిచ్చారు. కూడేరు మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌లో ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ నేటికీ మహిళలపై అత్యాచారాలు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతుండడం విచారకరం అన్నారు. సమాజం అభివద్ధి కావాలంటే మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, మహిళా సంఘం మండల నాయకురాలు చిదంబరం, ఉపాధ్యాయురాలు శశికళ పాల్గొన్నారు.



సెమినార్‌లో ప్రసంగిస్తున్న వి.సావిత్రి

అన్ని చెరువులకూ నీరిస్తాం

◆ బిటిపి ఎత్తిపోతల పనులు పూర్తి చేస్తాం
◆ ఉత్తర కొరియా కిమ్‌లా జగన్
◆ సూపర్-6ను ప్రజల్లోకి తీసుకెళ్లండి
◆ శంఖారావంలో నారా లోకేష్



రాయదుర్గంలో అభిమానులతో కరచాలనం చేస్తున్న నారా లోకేష్



ఉరవకొండ శంఖారావంలో ప్రసంగిసున్న లోకేష్

ప్రజాశక్తి-ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం

టిడిపి అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులు అన్నింటినీ పూర్తి చేసి జిల్లాలో చెరువులన్నింటికీ నీరందిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. టిడిపి శంఖారావం కార్యక్రమం అనంతపురం జిల్లాలో కొనసాగుతోంది. ఆదివారం నాడు ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో శంఖారావం బహిరంగ సభలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల టిడిపి అభ్యర్థులు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభల్లో నారా లోకేష్ ప్రసంగించారు. కరువుకు నిలమైన అనంతపురం జిల్లా అభివృద్ధికి టిడిపి పాలనలో కృషి చేశామన్నారు. దేశంలో ఎక్కడ చూసినా అనంత కియా కార్లే కనిపిస్తున్నాయంటే అది చంద్రబాబు నాయుడు విజనరీ పాలన అన్నారు. అనంతపురం జిల్లా అంటే తమకు ఎంతో ప్రేమ అన్నారు. అందుకే డబుల్ ప్రేమతో ఐదేళ్లలో అనంతను టీడీపీ ఎంతో అభివృద్ధి చేసిందని తెలిపారు. కరువు సీమలో కార్ల పంట పండించి కియా అనుబంధ సంస్థల ద్వారా 50వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలియ జేశారు. విజనరీ చంద్రబాబుకు, ప్రిజనరీ జగన్‌కు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే బిటి ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకాన్ని చేవడతావంన్నారం. రాయదుర్గం జీన్స్ గార్మెంట్ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రతి గడపకూ సురక్షిత తాగునీటి కొళాయిని అందించే ఏర్పాటు చేస్తామన్నారు. నార్త్ కొరియాలో కిమ్ నియంత పాలనలాగానే రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాల సాగించారన్నారు. ప్రశ్నించిన వారిని, ఎదురు తిరిగిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధం అన్నారు. సమయం, తేది జగన్మోహన్‌రెడ్డి చెప్తే అన్ని విషయాలపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. జగన్ అండ్ కో జె ట్యాక్స్‌ను వసూలు చేస్తూ ప్రజల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారని ఎద్దేవా చేశారు. ఓ చేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో 100 రూపాయలు ప్రజల నుంచి లాక్కుంటున్నారని విమర్శించారు. కరెంట్, ఆర్టీసీ ఛార్జీలు, ఇంటి, చెత్త పన్నులను పెంచి సామాన్యులపై భారాలు మోపాడదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అందిస్తున్న దాదాపు వంద రకాల సంక్షేమ పథనాలను రద్దు చేశాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ క్యాలెండర్‌ను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యత టిడిపి నాయకులు, కార్యకర్తలదే అన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన అనంతపురం జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌తో పాటు ఆయా నియోజకవర్గాల టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలన అవినీతి మయం

వైసిపి పాలన మొత్తం అవినీతి మయం అని నారా లోకేష్ విమర్శించారు. ఆయా నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాయదుర్గం ఎమ్మెల్యే అవినీతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పోటీ పడ్డారన్నారు. ఈసారి రాయదుర్గంలో అవినీతిపరుడు పోయి అసమర్థుడ్ని సమన్వయకర్తగా జగన్ నియమించారని ఎద్దేవా చేశారు. రాయదుర్గంలో టిడిపి, వైసిపి పరిపాలనలో జరిగిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమన్నారు. వైసిపి నాయకులు అంగీకరిస్తే తమ పార్టీ తరపున కాలవ శ్రీనివాసులు చర్చకు వస్తారన్నారు. ఉరవకొండ వైసీపీ ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆయన, ఆయన కొడుకు కలిసి నియోజకవర్గాన్ని దోచేశారన్నారు. దొంగ ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్లు, పత్రాలు సృష్టించి భూములు కొట్టేస్తున్నారన్నారు.

చంద్రబాబువి ఊసరవెల్లి రాజకీయాలు : అనంత

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి అధినేత చంద్రబాబువి ఊసరవెల్లి రాజకీయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ముందు నుంచి బిజెపి సిద్ధాంతాలకు మేం వ్యతిరేకం.. మతతత్వ పార్టీలకు వ్యతిరేకం అని సిఎం జగన్ స్పష్టంగా తెలిపారన్నారు. 'ఇంటింటికీ వైసీపీ'లో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే నగరంలోని 46వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అనంతపురం నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు సిఎం అని చెప్పుకునే చంద్రబాబుకు ఒక సిద్ధాతం, విధానం, నినాదం లేదన్నారు. సిద్ధాంత పరంగా విభేదించే రాజకీయ పార్టీలతోనూ కలిసి అవకాశవాద రాజకీయాలు చేస్తుడ్డాన్నారు. ఆయన జీవితమంతా పొత్తులు, అతుకులు, బొంతలు తప్పితే ఏదీ లేదన్నారు. చంద్రబాబు తీరును ప్రజలంతా గ్రహించారని, శాశ్వతంగా రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలే మాకు ఉన్నాయి. ప్రజల పక్షాన మేం నడుస్తున్నామన్నారు. మా వల్ల మేలు జరిగింటే ఓటు వేయాలని ధైర్యంగా కోరుతున్నామన్నారు. ఎవరు ఎన్ని పొత్తులతో వచ్చినా విజయం సాధించేది వైసిపిదే అన్నారు.

శంఖారావంను విజయవంతం చేద్దాం

అనంతపురం కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం సభ అనంతపురంలో సోమవారం జరగనుందని ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం నియోజకవర్గంకు సంబంధించి సోమవారం నాడు రుద్రంపేట బైపాస్‌లోని పీవీకేకే కళాశాల ప్రాంగణంలో శంఖారావం సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇక తెలుగుదేశం పార్టీ సెక్యులర్ పార్టీ అని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, అభివద్ధి కోసం బిజెపితో పొత్తు పెట్టుకున్నట్లు తెలియజేశారు. అనంతపురం అర్బన్ సీటు విషయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకుంటారని తెలియజేశారు. పవన్ కళ్యాణ్ అనంతపురం వస్తే భుజాల మీద వేసుకుని గెలిపిస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నకు ప్రభాకర్ చౌదరి సమాధానంగా చెప్పారు.

1994 చరిత్రను తిరిగి రాద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో 1994లో వచ్చిన ఫలితాలను 2024 ఎన్నికల్లో తిరిగి సాధించి చరిత్ర సృష్టిద్దామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన శంఖారావం సభలో కేశవ్ మాట్లాడుతూ నారా లోకేష్ పార్టీలోని పాత, కొత్తతరం నేతలను కలుపుకొని సరికొత్త పంథాలో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తల మనోభావాలను తెలుసుకునేందుకు లోకేష్ శంఖారావం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. బిజెపి-టిడిపి-జనసేన పొత్తు రాష్ట్రానికి మేలు కలయిక కాబోతోందన్నారు. అభివృద్ధితో ఆదాయాన్ని సృష్టించి పేదలకు పంచడం చంద్రబాబు సిద్ధాంతం అని, అప్పులు తెచ్చి పంచడం సిఎం జగన్ విధానమని, తద్వారా రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. టిడిపి హయాంలో 20 వేల మంది పేదలకు ఇళ్ళపట్టాలు, చెరువులకు నీరివ్వడం జరిగిందన్నారు. వైసిపి పాలనలో 3 ఎకరాలకు నీరివ్వలేదు, 3 తట్టల మట్టి తీయలేదన్నారు. ధన దీక్షలో పడి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రూ. 60 మద్యం క్వార్టరు రూ. 180కి అమ్మి రూ. 120ను నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు పంపుతున్నారన్నారు. వైసిపిని ఓడించేందుకు రైతులు, నిరుద్యోగులు, చేనేతలు, అన్ని వర్గాల ప్రజలతో పాటు తల్లి, చెల్లి కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. గెలిచినా, ఓడినా 30 ఏళ్ళుగా ఉరవకొండ ప్రజలతో నా అనుబంధం కొనసాగుతూనే ఉందని, గెలుపు పిలుపు వినబడుతోందని, అలసత్వాన్ని వీడి కార్యకర్తలంతా పని చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.



'శంఖారావం' సభలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం శాఖ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రెడ్ క్రాస్ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా యువతకు ప్రథమ చికిత్సపై 3 రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహన్‌కృష్ణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు గదుగు బాలాజీ, అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ పాల్గొని రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించే లోపు ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. కావున ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్సపై శిక్షణ పొంది అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చుట్టుపక్కల వారు ప్రమాదం బారిన పడినప్పుడు ప్రథమ చికిత్స చేసి ప్రాణాలు కాపాడాలన్నారు. తోటివారికి ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలన్నారు. కార్యదర్శి మోహన్‌కృష్ణ పాల్గొన్న వారికి శిక్షణ ఇచ్చారు. ప్రాణాలు కాపాడాలనే విషయాలను ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ట్రైనర్ డాక్టర్ కృష్ణవేణి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నందిత, అలేఖ్య, షేక్ చాందిని, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు శేషాద్రి, శీను, రెడ్ క్రాస్ వాలంటీర్లు ముత్యాలమ్మ, కీర్తి, సాకే రాజా పాల్గొన్నారు.




ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

సీమ ఉపాధ్యాయ కథల ముద్రణ గొప్ప అవకాశం

డాక్టర్ ఎం.హరికిషన్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం బి.ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) అనంతపురం జిల్లా శాఖ నిర్వహణలో డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షతన రాయలసీమ ఉపాధ్యాయ కథలు, పుస్తకాలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగిస్తూ రాయలసీమ సామాజిక, ఆర్థిక, రాజకీయ, వర్తమాన, చారిత్రక పరిస్థితులకు కథలు అద్దం పడతాయన్నారు. బండి నారాయణస్వామి ప్రసంగిస్తూ ప్రతి కథ పాఠశాల పరిస్థితుల ను కళ్లకు కట్టినట్లు చూపిస్తుందన్నారు. డాక్టర్ శాంతి నారాయణ ప్రసంగిస్తూ మనల్ని ఆలోచింపచేసే కథలు ఇవి అన్నారు. డాక్టర్ కె.నాగేశ్వరాచారి పుస్తకాన్ని సమీక్ష చేస్తూ 42 మంది కథా రచయితలు విద్యా వ్యవస్థలోని లోపాలను సమాజానికి తెలియజేశారన్నారు. సంకలన కర్త డాక్టర్ ఎం.హరికిషన్ ప్రసంగిస్తూ రాయలసీమ ఉపాధ్యాయ కథలన్నీ ఓ చోట ముద్రించడానికి అవకాశం ఇవ్వడం 42 మంది కథకుల గొప్పతనం అన్నారు. రాయలసీమ స్థితిని సమాజానికి తెలియజేయడానికి ముందుంటానన్నారు. సభ ప్రారంభంలో ఇటీవల కన్నుమూసిన ప్రముఖ హాస్య కథ నవలా రచయిత్రి జయ లక్ష్మి రాజు, కర్నూలు జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, అరసం కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.జయరాం మృతికి నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అరసం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, డాక్టర్ డి.అనితమ్మ, టి.రాజారామ్, గంగిరెడ్డి గారి అశ్వత్థరెడ్డి, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, యంగన్న, గోవిందరాజులు, దాసరి ఆదినారాయణ, కొత్తపల్లి సురేష్, మధురశ్రీ, వన్నప్ప, డాక్టర్ జూటూరు షరీఫ్, వెంకటరమణ, పెద్దన్న, కటకం కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, అరసం సభ్యులు

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించింది టిడిపి నాయకులే : వైసిపి

ప్రజాశక్తి-తాడిపత్రి

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించింది టిడిపి నాయకులే అని, వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి ఫ్యాక్షన్ నేరాలు లేవని వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి, గంగులకుంట కేశవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో జెసి ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవగానే పల్లెల్లో పాత కక్షలకు ఆజ్యం పోసింది, రెచ్చగొట్టి క్రిష్టిపాడు ఆఫీస్‌లో పట్టపగలు హత్య చేయించిన చరిత్ర టిడిపి నాయకులది అన్నారు. ఆ కేసులో వారికి యావజ్జీవ శిక్ష కూడా పడించాన్నారు. తాడిపత్రి అభివృద్ధిని అడ్డుకోవడమే అజెండాగా జెసి ప్రభాకర్‌రెడ్డి పని చేస్తున్నారని విమర్శించారు. 35 ఏళ్ల రాజకీయ జీవితంలో తాడిపత్రి కాలేజీ కాంపౌండ్ వాల్ ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. అనేక పరిశ్రమలు ఉన్న తాడిపత్రిలో వంద పడకల హాస్పిటల్ అవసరమని తెలిసినా ఎందుకు నిర్మించలేద న్నారు. పుట్లూరు, యల్లనూరు, నార్పల, తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి ఆర్‌టిఒ కార్యాలయం 2007లోనే తాడిపత్రికి వస్తే ఎందుకు నిర్మించలేకపోయారని నిలదీశారు. ఆటోనగర్‌తో పాటు డిగ్రీ కళాశాలకు రాకపోకలకు బస్సు సౌకర్యం కల్పించకుండా విద్యా వ్యవస్థను సర్వ నాశనం చేసింది జెసి సోదరులే అన్నారు. ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి గెలిచిన వెంటనే వంద పడకల ఆసుపత్రి, ఆర్‌టిఒ కార్యాల యం, కాలేజీ కాంపౌండ్ వాల్, నిరుపేదలకు జగనన్న కాలనీలు నిర్మించామన్నారు. పెన్నానదిని నీటితో నింపి తాగు, సాగు నీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. అయితే జెసి ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధి కంతకుడిలా అడుగడుగునా అడ్డుకోవడం తగదన్నారు. నియోజకవర్గ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసిపిని భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.రాజశేఖర్‌రెడ్డి, గంగులకుంట కేశవరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమసమాజ స్థాపన

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ మంత్రి శంకరనారాయణ

ప్రజాశక్తి-బెళుగుప్ప

మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రంలో సమసమాజ స్థాపన సాధించవచ్చనే ధ్యేయంతో సిఎం జగన్ రాష్ట్రంలో వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మఒడి, తదితర సంక్షేమ పథకాలు అమలు చేశారని ఉరవకొండ వైసిపి సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ మంత్రి శంకరనారాయణ పేర్కొన్నారు. మండలంలోని శీర్పి గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'వైఎస్సార్ చేయూత' కార్యక్ర మంలో వారు పాల్గొని మాట్లాడారు. 99 శాతం హామీలు పూర్తి చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుం దన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ పేరుతో మోసం చేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేయగా సిఎం జగన్ రుణమాఫీ కింద రూ. 25 వేల కోట్లు చెల్లించి మహిళా సంఘాలను నిలబెట్టాడన్నారు. అనంతరం మహిళలకు మెగా చెక్కును అందజేశారు. మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, వైకెపి ఎసి రాధారాణి, ఎపిఎం ఆంజనేయులు, ఎంపీపీ పెద్దన్న, వైస్ ఎంపీపీ పుష్పావతి, మచ్చన్న, వీరన్న, రామాంజనేయులు, త్రిలోకనాథ్ రెడ్డి, అశోక్, శ్రీనివాసులు, శివలింగప్ప, ఉమారాణి, గోపాల్, తాతప్పబాబు, శంకర్‌రెడ్డి, రామకృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు. దుద్దేకుంట, బుద్ధికుంట గ్రామాల జగనన్న కాలనీలో ప్రభుత్వం 120 మంది పేద దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా వాటిని ముఖ్యఅతిథి విశ్వ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, సర్పంచి రత్నమ్మ, ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు త్రిలోక్‌రెడ్డి, ఎర్రిస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హనుమంతరాయుడు, వీరాంజనేయులు, వీఆర్వో నాగేంద్ర, సెక్రటరీ జగదీష్, ఓబులేసు పాల్గొన్నారు.

గంగవరంలో 'ఇంటింటికీ మన విశ్వన్న'

మండలంలోని గంగవరం గ్రామంలో సాయంత్రం నిర్వహించిన 'ఇంటింటికీ మన విశ్వన్న' ఎన్నికల ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. ముందుగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వరరెడ్డిపై గ్రామస్తులు పూలుచల్లి ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం విశ్వ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ప్రచార రథంపై రోడ్ షో నిర్వహించారు. జెండా కట్ట కూడలిలో ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచి రోజా, ఎంపీపీ పెద్దన్న, ఎంపిటీసీ ప్రసాద్, ఉప సర్పంచి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు మచ్చన్న, నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, త్రిలోక్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

మహిళలు చైతన్యవంతులుగా మారి అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామల సూచించారు. పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న అల్లిపీరా మఠంలో ఆదివారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సంఘం పట్టణ కార్యదర్శి జ్యోతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి శ్యామల మాట్లాడుతూ మహిళలు మూఢనమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథంతో పురోగతి వైపు అడుగులు వేయాలన్నారు. లెక్చరర్ శశికళ మాట్లాడుతూ స్త్రీ కుటుంబాన్ని, సమాజాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లి సమానత్వం చాటి చెప్పేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు రేష్మ, ఐద్వా అధ్యక్షురాలు రంగమ్మ, నాయకురాలు లక్ష్మీబాయి, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

వ్యక్తిపై కొడవలితో దాడి

నార్పల : నార్పల క్రాసింగ్ సమీపంలో ఉన్న శ్రీవీరాంజనేయ ట్రాన్స్‌పోర్ట్ వెనుక వైపున ఉన్న వేరుశనగ మిల్లులో చెన్నంపల్లికి చెందిన బయపరెడ్డిపై నార్పలకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కొడవలితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బయపరెడ్డిని 108 ద్వారా అనంతపురం తరలించారు. వారిద్దరూ క్రాసింగ్ సమీపంలో ఏదో విషయంలో వాగ్వావాదం చేసుకున్నారు. మాట మాట పెరిగి చంద్రశేఖర్‌రెడ్డి గొడ్డలితో బయపరెడ్డిపై దాడి చేశాడు. ఘటనపై ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు యువత నాయకుడు మృతి

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు(37) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలోని బిసి కాలనీలో స్థిరపడ్డ ఆయన కొన్నేళ్లుగా టిడిపిలో చురుగ్గా పని చేసేవాడు. ఆయన మృతి పట్ల టిడిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నారా లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప, ఉపాధ్యక్షులు సాకే భాస్కర్ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేశారు. 'శంఖారావం'లో భాగంగా ఉరవకొండకు వచ్చిన నారా లోకేష్‌ను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. సిఎం జగన్ హామీలను నెరవేర్చకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను మానసికంగా వేధించడంతో పాటు జీవోల పేరుతో వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ విడపనకల్లు మండల ప్రధాన కార్యదర్శి తలారి నరసింహులు, కప్పట్రాళ్ల దాదా ఖలందర్, ఇమాంసాబ్, ఆదినారాయణ పాల్గొన్నారు.



నారా లోకేష్‌ను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు

ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ దారుణ హత్య

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం నాడు అనంతపురం జేఎన్టీయూ వద్ద చోటు చేసుకుంది. వన్‌టౌన్ సిఐ ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల మేరకు నగరానికి చెందిన మూర్తిరావు గోకలే (59) అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. స్థానిక జెఎన్‌టియు ఎదురుగా ఈయన నివాసం ఉంటున్నాడు. ఈయనకు తన సొంత అక్క కుమారుడైన ఆదిత్యకు మధ్య చాలా కాలంగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం ఆదిత్య మూర్తిరావు గోకలే ఇంటికి వచ్చి వాదనకు దిగాడు. మాటమాటా పెరగడంతో ఆదిత్య ఒక్కసారిగా బ్లేడుతో మూర్తిరావు గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావమై ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. హత్యకు కారణం కుటుంబ కలహాలే అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం దక్కాలి

ప్రజాశక్తి-గుత్తి

అంతర్జాతీయంగా మహిళలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం దక్కాలని సిఐటియు అనుబంధ సంస్థ శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ వి.నిర్మల, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలను గౌరవించి స్వేచ్ఛ కల్పించి వారి హక్కులను కాపాడాలన్నారు. అందుకోసం సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు ఆర్ఎన్.కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, రైతు సంఘం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నిర్మల, రేణుక



మంత్రి రోజాతో మాట్లాడుతున్న విజయభాస్కర్

గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా చేయాలని మంత్రికి వినతి

గుత్తి : అద్భుత కట్టడాలు ఉన్న గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజాకు విన్నవించారు. అనంతపురంలో నూతనంగా నిర్మించిన పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు ఆర్కియాలజికల్ మ్యూజియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి రోజాను విజయభాస్కర్ కలిశారు. గుత్తి కోటలో చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని ఓసారి సందర్శించాలని కోరారు. కోటలో సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే గుత్తి కోటను ఎందరో పర్యాటకులు వీక్షిస్తారని ఆయన మంత్రితో చెప్పారు. మంత్రి రోజా సానుకూలంగా స్పందించారని విజయభాస్కర్ తెలిపారు.

యువతి వివాహానికి సాయం

అనంతపురం : రూరల్ మండలంలోని సోమలదొడ్డి గ్రామానికి చెందిన నిరుపేద సుంకన్న, నాగమ్మ దంపతుల కుమార్తె వివాహానికి ఆదివారం నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి సాయం చేశారు. ట్రస్ట్ సభ్యులు పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బండి రమేష్‌బాబు, కళావతి దంపతుల 25వ పెళ్లిరోజు సందర్భంగా ఆదివారం నగరంలోని ఆదర్శనగర్‌లో ఉన్న పుట్టినిల్లు ఆశ్రమం వద్ద నిర్మల రూ. 20వేల విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ. 3వేల నగదును యువతి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కవీన్, ఆదిత్య, నాగరాజు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి 'అమ్మ' సంస్థ చేయూత

అనంతపురం : నగరంలోని పాతూరుకు చెందిన నిరుపేద అలివేలమ్మకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. ఆమెకు కిడ్నీ మార్పిడి చేస్తే బతికే అవకాశం ఉందని, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ. 8 లక్షలు ఖర్చు అవుతుం దని బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఆమె మేనత్త రామలక్ష్మమ్మ కిడ్నీ ఇవ్వడానికి ముందుకొచ్చింది. అయితే డబ్బు లేక దిక్కుతోచని స్థాయిలో ఉన్న ఆమెకు ఆదివారం 'అమ్మ' సంస్థ అధినేత తరిమెల రమణారెడ్డి రూ. 2 లక్షలు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని కూడా దాతల ద్వారా సమకూర్చుతానని రమణారెడ్డి తెలిపారు.

ముస్సిపల్ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్

గుంతకల్లు : శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్లు పట్టణంలోని శ్రీరాధాకృష్ణ మున్సి పల్ బాలుర ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కె.రామకృష్ణ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ప్రొఫెసర్ ఎన్.సావిత్రమ్మ పర్యవేక్షణలో ఓ అంశంపై పరిశోధన చేసి, పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినట్లు తెలిపారు. తన పరిశోధన వ్యాసాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురి తం అయ్యాయన్నారు. నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌తో సహా పలు జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్స్‌లో పాల్గొని ప్రసంగించానన్నారు.



కె.రామకృష్ణ

రియా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

అనంతపురం : మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం లో ఆదివారం అనంతపురం నగరంలోని రియా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ మోదుపల్లి ఉదయ్‌కుమార్ రోగులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. కార్యక్రమంలో రియా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మోదుపల్లి లక్ష్మీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రికి వాటర్ ఫిల్టర్ వితరణ

నార్పల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆదివారం ల్యాబ్ టెక్నీషియన్ అరుణ రూ. 20 వేల విలువ చేసే ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, ప్రజల కోసం సొంత డబ్బుతో ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ అందజేసినట్లు తెలిపారు. అరుణను వైద్యులు ప్రవీణ్, సాధియతో పాటు సహ ఉద్యోగులు అభినందించారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి వైద్య ఖర్చుల కోసం ఆదివారం నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు ఆర్థికసాయం చేశారు. కాలనీకి చెందిన రామాంజనేయులు కొంత కాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతుండగా నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకుడు శ్రీనివాసులు, తదితరులు వైద్య ఖర్చుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

నార్పల : స్థానిక చౌడమ్మ కట్ట వీధికి చెందిన మోదీన్ కొద్ది రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న యువకులు బాలనాగి నరేష్, మొరుసు భాస్కర్‌రెడ్డి పలువురితో చందాలు పోగేసి ఆ కుటుంబానికి ఆదివారం రూ. 12వేల నగదుతో పాటు రూ. 2 వేల విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు.

టిడిపిలో పలువురు చేరిక

బొమ్మనహాల్ : మండలంలోని కురవల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, నేమకల్లు, దేవగిరి, ఉద్దేహాల్ గ్రామాలకు చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు ఆదివారం బొమ్మనహాల్‌లో రాయదుర్గం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సమక్షంలో టిడిపిలో చేరారు. కాలవ మాట్లాడుతూ టిడిపి విధానాలు, పథకాలకు ఆకర్షితులై వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారన్నారు. పార్టీలో చేరిన వారికి కాలవ టిడిపి కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్నప్పతాత రథోత్సవం

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన ఎన్నప్ప తాత ఆలయం వద్ద ఆదివారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి స్వామి నామస్మరణ మధ్య ఆలయ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు స్వామికి మొక్కు చెల్లించారు.

హుండీ సొమ్ము లెక్కింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు బండి క్రిష్టప్ప, అధ్యక్షులు జయంతి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, కోశాధికారి గెల్లి లక్ష్మన్న, సభ్యు సమక్షంలో హుండీని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న హుండీలో రూ. 3.82 లక్షలు ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సొమ్మును కమిటీ సభ్యుల తీర్మానం మేరకు ఆలయ అభివృద్ధి, ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కుమార్, అజయ్ టైలర్ రఘు, ముత్తయ్య, లక్ష్మి బజార్ లక్ష్మీనారాయణ, హమాలీ యూనియన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మైనార్టీలకు అవకాశం ఇవ్వాలి

అనంతపురం : వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం మైనారిటీలకు అవకాశం ఇవ్వాలని జమియత్-ఏ-ఉలమా-ఇ-హింద్ వేదిక డిమాండ్ చేసింది. నగరంలోని పారడైజ్ ఫంక్షన్ హాలులో ఆదివారం ముస్లిం మైనార్టీల సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3 లక్షల ఓటు బ్యాంకు కలిగిన ముస్లిం మైనార్టీలు ప్రతి చోటా కీలకంగా ఉన్నారన్నారు. అనంతపురం అర్బన్‌లో 70 వేల ఓట్లు ఉన్నాయని, రానున్న ఎన్నికల్లో అనంతపురం ఎమ్మెల్యే, ఎంపి స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. నదీమ్‌కు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలు సీటు కేటాయించని పరిస్థితుల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయిస్తామన్నారు.



ప్రచారం చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

వైసిపి ఎన్నికల ప్రచారం

రాయదుర్గం : పట్టణంలోని 22వ వార్డు అంబేద్కర్‌నగర్లో ఆదివారం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సిఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఉపేంద్రరెడ్డి, నాయకులు శివప్ప, నాగప్ప, శివ, శ్రీనివాసులు, ఇస్మాయిల్, ఆనంద్, కౌన్సిలర్లు వన్నూరప్ప, గోవింద, శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బెళుగుప్ప : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి సూచించా రు. బెళుగుప్పలో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. ముఖ్యఅతిథి నాగమణి మాట్లాడుతూ మహిళలు వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకూ అన్నిరంగాల్లో విశేష కృషి చేస్తున్నారన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్ ప్రక్రియ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారే తప్ప న్యాయం చేయడం లేదన్నారు. స్త్రీని వాణిజ్య సరుకుగా మాత్రమే చూసే కార్పొరేట్, మతతత్వ పాలన అంతమైనప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యవతి, సుజాత, నాగమణి, మండల కార్యదర్శి భీమన్న, మల్లి, మహిళలు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న నాగమణి, తదితరులు